కొత్త చట్టంపై అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, మే 3 : ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన ఉండాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చట్టాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడానికే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. గతంలో భూ సమస్య పరిష్కారానికి తహసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ అని ఇలా ఉన్న పద్ధతిని తగ్గించారని గుర్తు చేశారు. కోర్టు కేసులు ఉంటేనే ఆ భూ సమస్యను కలెక్టర్ స్థాయిలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్, తహసీల్దార్ జయరాం, నయాబ్ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐ రజితా రాణి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో కలపడం సరి కాదు

సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు భీమ్‌రాజు

కొడంగల్, మే 3 : బీసీ డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ ఏలో కలపడం సరి కాదని వడ్డెర సంఘం సభ్యులు ఆరోపించారు. శనివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెరలను బీసీ ఏ నుంచి ఎస్టీ జాబితాలో చేరుస్తామని అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటి వరకు హామీ నెరవేరలేక పోవడంతో తీవ్రంగా అన్యాయం జరుగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చే ముందు వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం సభ్యులు భీమ్‌రాజు, దస్తప్ప, భీములు, కిష్టప్ప, బసంతి, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బొంపల్లి పాఠశాలలో వేసవి పఠన శిబిరం పరిశీలన

బొంపల్లి పాఠశాలలో వేసవి పఠన శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దోమ, మే 3 : దోమ మండల పరిధిలోని బొంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న వేసవి పఠన శిబిరం, ఏఐ తరగతులను శనివారం సీఎంవో రజిని, జీసీడీవో శ్రీదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి పఠన శిబిరంలో విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను తీసుకుంటూ వారికి బొమ్మలు గీయడం, రంగులు వేయడం, కంప్యూటర్‌లో వివిధ రకాల కార్యకలాపాలను నేర్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారు విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటయ్య, వలంటీర్లు అఖిల్,అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మే 3: జిల్లాలోని ప్రతి కొనుగోలు కేంద్రంలోనూ వరి ధాన్యం సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శనివారం వరి ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 129 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రైతులు కష్టపడి పండించిన పంట వర్షాలతో తడిసిపోకుండా తాడిపత్రిలు, సంచులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తూనిక, తేమ యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లర్లకు చేరవేయాలని తెలిపారు. ధాన్యాన్ని సేకరించేందుకు హమాలీలను పెంచుకోవాలని సూచించారు. ధాన్యం రవాణా చేసేందుకు వాహనాలను సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, మార్కెటింగ్ ఏడీ సారంగపాణి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా సహకార అధికారి నాగార్జున, డీసీఎంఎస్ అధికారి శ్యామ్ సుందర్ రెడ్డి, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

నాందార్‌పూర్‌లో క్రికెట్ టోర్నమెంట్

క్రికెట్ టోర్నమెంట్ కరపత్రాలను విడుదల చేస్తున్న సొసైటీ సభ్యులు

బొంరాస్‌పేట, మే 3 : మండల పరిధిలోని నాందార్‌పూర్‌లో గార్గి విద్యానికేతన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నవీన్ ఎడుకేషన్ సొసైటీ సభ్యులు, గ్రామ యువకులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 7 నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని అసక్తి ఉన్న వారు పాల్గొనాలని తెలిపారు. ఒక టీమ్‌కు ఎంట్రీ ఫీజు రూ.1,100 ఉంటుందని తెలిపారు. ఉమ్మడి మండలానికి చెందిన టీం సభ్యులకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.11,116 అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నవీన్ ఎడుకేషన్ సొసైటీ సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో తిప్పలు

- ఉక్కపోతతో ఇబ్బందులు
- స్టోన్ వ్యాపారులు, కార్మికుల ఇబ్బందులు

తాండూరు రూరల్, మే 3 : తాండూరు మండల పరిధిలో ట్రాన్స్‌కో అధికారులు అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో పగడిపూట ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాండూరు చుట్టూ ఉండే స్టోన్ వ్యాపారులు, కార్మికులు, లోడింగ్, అన్‌లోడింగ్ కూలీలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ అధికారులు ఇష్టారీత్యా కోతలు విధిస్తుండడంతో గృహాల్లో ఉండే వారు ఉక్కపోతను తట్టుకోలేకపోతున్నారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ కోత విధించారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. చిన్నపాటి చిరు జల్లులు కురిస్తే చాలు కరెంట్ కట్ చేస్తారు. ఇదేమని ప్రశ్నిస్తే పై నుంచి కరెంట్ లేదనే సమాధానం లైన్‌మెన్, ఏఈల నుంచి వస్తున్నది. మండల పరిధిలోని గౌతాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో వేయికి పైగా స్టోన్ పాలీషింగ్ యూనిట్లు ఉన్నాయి. కరెంట్ కోతల కారణంగా తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు పాలీషింగ్ యూనిట్లలో పని చేసే కార్మికులతోపాటు లారీల్లో నాపరాయిని లోడింగ్, అన్‌లోడింగ్ చేసే కూలీ పనులు మందగించాయి. తమకు సరిపడా కూలీ డబ్బులు రావడం లేదని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు, వ్యాపారులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వస్తున్నది. ఉన్నతాధికారులు స్పందించి కరెంట్ కోతలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సమాచారమిస్తే.. ప్రత్యేక నిఘా

పరిగి డీఎస్పీ శ్రీనివాస్

పరిగి, మే 3 : వేసవి సెలవుల్లో ఇండ్లకు తాళాలు వేసి వేరే ప్రాంతాలకు వెళ్లే వారు విలువైన వస్తువులు, డబ్బులు ఇంట్లో పెట్టరాదని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. బ్యాంకు లాకర్లలో విలువైన వస్తువులు పెట్టుకోవాలన్నారు. ఈ విషయాన్ని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇస్తే తాళాలు వేసిన ఇండ్లపై ప్రత్యేక నిఘా పెట్టి, ఆయా ప్రాంతాల్లో పోలీసు పహారాను పెంచుతామని, తద్వారా దొంగతనాలు జరగకుండా నివారించేందుకు ప్రయత్నిస్తామన్నారు. బస్టాండ్లలో దొంగతనాలకు పాల్పడేవారు సాధారణ ప్రయాణికుల్లా వస్తారని, బస్సులు ఎక్కే సమయంలో ఒత్తిడికి గురిచేసి దొంగతనానికి పాల్పడుతుంటారన్నారు. బస్సులు ఎక్కే సమయంలో జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ సూచించారు. గ్రామాలు, ఇండ్ల ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా 24 గంటలపాటు ఏమి జరుగుతుందనేది రికార్డు అవుతుందని, దొంగతనాల నివారణకు, నేరస్తులను గుర్తు పట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. తక్కువ ధరలకే సీసీ కెమెరాలు లభిస్తున్నాయని వాటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

విద్యార్థులను సన్మానించిన అధికారులు

బషీరాబాద్, మే 3 : విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థానాలకు వెళ్తారని తహసీల్దార్ వెంకటేశ్, ఎంపీడీవో విజయ్‌కుమార్ అన్నారు. పదో తరగతి పరీక్షలో మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన భావన (549) ప్రథమ స్థానం, సలేహా (533) ద్వితీయ స్థానం, నవనీత(513) తృతీయ స్థానం సాధించిన విద్యార్థులను శనివారం వారు సన్మానించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మైల్వార్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, బషీరాబాద్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హీర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్ల పెండ్లికి సాయం

సహాయం అందిస్తున్న మాజీ సర్పంచ్ శాంతీతులసీరాం

కులకచర్ల, మే 3 : మండల పరిధిలోని పటేల్‌చెరువుతండాపంచాయతీలో మాజీ సర్పంచ్ శాంతీతులసీరాం గ్రామానికి చెందిన విస్తావత్ శాంతిబాయి, బాబ్యానాయక్ కుమార్తె జ్యోతి వివాహానికి క్వింటాలు సోనాబియ్యం, 15కిలోల మంచినూనె అందజేశారు. కార్యక్రమంలో తండా పెద్దలు నేనావత్ చందర్, ఠాగూరు. రవి, లక్ష్మీబాయి, రాంచందర్, సురేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, మే 3 : తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్, హైదరాబాద్‌లోని మైనార్టీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ–సీఎస్ఏటీ 2026 పరీక్ష కోసం 2025–26 విద్యా సంవత్సరంలో మైనార్టీ అభ్యర్థులకు (ముస్లిమ్స్, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు) ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నామని జిల్లా మైనార్టీ అధికారి సత్తార్ శనివారం ఒక ప్రకనటలో తెలిపారు. ఈ శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్డ్ కేటగిరీల్లో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశం మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని తెలిపారు. అన్ని జిల్లాలలోని గుర్తింపు పొందిన డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు ఈ నెల ఒకటో తేదీ నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో https://cet.cgg.gov.in/tmreis వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రవేశ పరీక్ష జూన్ 5న వికారాబాద్ జిల్లాలోని తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 7993357103 కు కార్యాలయ పని వేళలో సంప్రదించాలన్నారు.

నేడు రంగాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

పరిగి, మే 3 : సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పరిగి మండలం రంగాపూర్‌లోని సత్యసాయి సేవా కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉన్నట్లు నిర్ధారణ జరిగితే ఉచితంగా నెలకు సరిపడా మందులు అందజేస్తామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే వైద్య శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

ధారూరు, మే 3 : మండల పరిధిలో ఈ నెల 5నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సాజిదాబేగం ఒక ప్రకటనలో తెలిపారు. 5న అవుసుపల్లి, బాచారం గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఉపాధ్యాయుడికి గజల్ ప్రతిభా పురస్కారం

పురస్కారం అందుకున్న ద్యావరి నరేందర్‌రెడ్డి

పెద్దేముల్, మే 3 : ప్రముఖ కవి, పెద్దేముల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు ద్యావరి నరేందర్‌రెడ్డి గజల్ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ వెలుదండ నిత్యానందరావు, గజల్ సాహిత్య వేదిక అధ్యక్షుడు ఇరివింటి వెంకటేశ్వర శర్మ ద్యావరి నరేందర్‌రెడ్డికి ఈ పురస్కారాన్ని అందజేసి సన్మానించారు. రెండు దశాబ్దాలుగా గజల్ ప్రక్రియలో విశేషంగా కృషి చేస్తూ భక్తి, అభ్యుదయ, ప్రణయ భావాలతో గజళ్లు రచన చేస్తున్నందుకు పురస్కారాన్ని అందిస్తున్నట్లు వారు తెలిపారు. తెలుగు గజల్ ప్రక్రియను భక్తిమార్గంలో నడిపించిన ద్యావరి నరేందర్‌రెడ్డి యువకవులను దిశా నిర్దేశం చేశారన్నారు. ఈ సందర్భంగా తాండూరు కళాభారతి ప్రతినిధులు రామకృష్ణారాజు, కొటం చంద్రశేఖర్, గాజుల పవన్ కుమార్, సిద్ధిలింగమయ్య, జైపాల్‌రెడ్డి, మొగులయ్య, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కవులు రెంటాల వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణేశ్వర శర్మ, గడ్డం శ్యామల, కొరుప్రోలు మాధవరావు, వెన్నెల సత్యం, గజల్ గాయకుడు కేశిరాజు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పట్టా భూమిలో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్, మే 3 : మండల పరిధిలోని పర్సాపూర్‌కు చెందిన దళితుల భూమిలో దౌర్జన్యంగా రోడ్డు వేస్తున్న కాంట్రాక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రజాసంఘాల నాయకులు వెంకటయ్య, బుస్స చంద్రయ్య, దస్తయ్య, చంద్రయ్య డిమాండ్ చేశారు. పర్సాపూర్ గ్రామానికి చెందిన ఇస్వప్ప, ప్రవీణ్‌కుమార్ అనే దళిత రైతుల పట్టాభూమి 30గుంటల్లో నుంచి కాంట్రాక్టర్ అక్రమంగా రోడ్డు వేస్తున్నారని వారు తెలిపారు. శనివారం వారు ఆ రోడ్డు పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిన్నయ్య, రాజు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ నుంచి బూచన్‌పల్లి చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులను శనివారం స్థానిక నాయకులు ప్రారంభించారు. - మర్పల్లి, మే 3

చెరువులో పడి వ్యక్తి మృతి

తాండూరు రూరల్, మే 3 : చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కరణ్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. తాండూరు మండల పరిధిలోని మైసమ్మతండాకు చెందిన రాథోడ్ సాంత్‌కుమార్ (28) శుక్రవారం పాషాపూర్‌తండాలో ఓ విందుకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం 5 గంటలకు ఇంటికొచ్చాడు. సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం వెతికారు. ఎక్కడా కనిపించలేదు. శనివారం ఉదయం 6 గంటలకు జయరాంచౌహాన్ అనే వ్యక్తి రాథోడ్ సాంత్‌కుమార్ బైక్ ఐలోని చెరువు వద్ద ఉందని, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన చెరువు వద్దకు వచ్చి చూడగా రాథోడ్ సాంత్‌కుమార్ చెరువులో పడి మృతి చెందాడు. మృతుడి భార్య రాథోడ్ లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు ఏర్పుమళ్లలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

బొంరాస్‌పేట, మే 3 : మండల పరిధిలోని ఏర్పుమళ్లలో ఆదివారం అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్నామని సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డిని కలిసి ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. యువకులు, సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సూర్యనాయక్, శేఖర్, నర్సింహులు, సుభాష్, ఇసువయ్య, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామన్న మాదిగకు కార్మిక శక్తి అవార్డు

డోమ, మే 3 : మండల పరిధిలోని గుండాల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు రామన్న మాదిగ కార్మిక శక్తి అవార్డుకు ఎంపికయ్యారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు కార్మికుల తరపున ఎన్నో పోరాటాలు చేసి వారి హక్కుల కోసం కృషి చేశారు. కార్మిక దినోత్సవం సందర్భంగా ఈ అవార్డుకు ఎంపిక చేశామని ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి రామ్మూర్తి తెలిపారు.

నీట్ నిర్వహణకు పటిష్ట బందోబస్తు

ఎస్పీ నారాయణ రెడ్డి

వికారాబాద్, మే 3 :వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 4న జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణకు ఎలాంటి అవాంతరాలు లేకుండా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని మొత్తం 5 పరీక్షా కేంద్రాలను గుర్తించామని, వీటిలో 1,193 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని ఆయన తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, పరీక్షా కేంద్రాల వద్ద శాంతి భద్రతల దృష్ట్యా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎవరూ పరీక్షా కేంద్రాల సమీపంలో అనవసరంగా గుమిగూడవద్దని, తల్లిదండ్రులు అభ్యర్థులను డ్రాప్ చేసి వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేయాలని ఆదేశించారు.

బొలెరో ఢీకొని యువకుడి మృతి

సుభాష్(ఫైల్)

వికారాబాద్, మే 3 : బొలెరో వాహనం బైకును ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మోమిన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. శనివారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మోమిన్‌పేట మండల పరిధిలోని రాళ్లగుడుపల్లి గ్రామానికి చెందిన మొల్లని సుభాష్ (30) శుక్రవారం రాత్రి బూరుగుపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నాడు. రాళ్లగుడుపల్లి వైపు నుంచి కల్లు సరఫరా చేసుకుంటూ వస్తున్న బొలెరో వాహనం నడిపే డ్రైవర్ అతి వేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న సుభాష్ రోడ్డు పక్కన పొలంలో పడిపోవడంతో ముఖానికి, తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సుభాష్ తండ్రి మొల్లని నర్సయ్య శనివారం మోమిన్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై అరవింద్ విచారణ సేకరించి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంసీహెచ్‌లో గర్భిణి మృతి

సుమిత్ర (ఫైల్)

యాలాల, మే 3 : కండ్లు తిరుగుతున్నాయని మహిళను వైద్యం కోసం తీసుకొచ్చిన కొన్ని గంటల్లోనే ఆమె మృతదేహాన్ని భర్తకు అప్పగించిన ఘటన తాండూరు పట్టణంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పెద్దేముల్ మండలం పాషాపూర్ తండాకు చెందిన సుమిత్రా బాయి, విష్లావత్ జైసింగ్ భార్యా భర్తలు. వీరికి 9 ఏండ్ల కితం వివాహమైంది. ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ఓ కుమారుడు మృతి చెందాడు. సుమిత్రా బాయి ప్రస్తుతం 8 నెలల గర్భిణి. ప్రసవానికి ఇంకా 45 రోజుల సమయం ఉండగా, కండ్లు తిరుగుతున్నాయని పాషాపూర్ నుంచి శనివారం ఉదయం 6 గంటలకు తాండూరులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి భర్త జైసింగ్ తీసుకొచ్చాడు. వైద్యులు అందుబాటులో లేక స్టాఫ్ నర్స్ ఆలస్యంగా వైద్యం అందించిందని, సరైన వైద్యం అందక పోవడంతోనే తన భార్య మరణించిందని జైసింగ్ ఆరోపించారు. ఆమె మృతితో బంధువుల రోదనలు అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించాయి.

పరిగి, మే 3 : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన కె.రామకృష్ణారావును శనివారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎస్‌కు ఎమ్మెల్యే పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

కులకచర్ల, మే 3 : కులకచర్ల మండల కేంద్రానికి చెందిన గొల్ల వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం మృతురాలి కుటుంబాన్ని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆనందం పాల్గొన్నారు.

కోట్‌పల్లి కేజీబీవీలో ఇంటర్ అడ్మిషన్లు

బంట్వారం, మే 3 : కోట్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ తరగతులను త్వరలో ప్రారంభించనున్నట్లు కేజీబీవీ ఎస్ఓ పల్లవి, ఎంఈవో చంద్రప్ప ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన బాలికలు అడ్మిషన్లు తీసుకోవాలన్నారు. పదో తరగతి వరకు ఉన్న పాఠశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ (నర్సింగ్ ట్రేనింగ్), ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబ్ టెక్నిషీయన్) కోర్సులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పదో తరగతి పాసైన వారు ఈ కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకోవాలన్నారు. మరిన్ని వివవరాలకు కేజీబీవీ ఎస్ఓ పల్లవిని సంప్రదించాలని వారు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

రవి(ఫైల్)

తాండూరు రూరల్, మే 3 : ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కరణ్‌కోట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. తాండూరు మండల పరిధిలోని ఎల్మకన్నె గ్రామానికి చెందిన సిరిగిరిపేట రవి (35) ఏప్రిల్ 13న సాయంత్రం 4 గంటలకు పనికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకూ తిరిగి ఇంటికి రాలేదు. భార్య సిరిగిరిపేట స్వాతి బంధువుల, స్నేహితుల వద్ద భర్త ఆచూకీ కోసం వెతికింది. భర్త ఆచూకీ తెలియక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
FINANCIAL SERVICES
★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All
గమనిక